సాక్షి ఖమ్మం
శనివారం ၊ 2 ၊ సెప్టెంబర్ ၊ 2023



ఆయన వాహనం.. స్కూటీ!
ఎంత దూరమైనా సరే స్కూటీపై మాత్రమే వెళ్తూ ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. IIలో



...ప్రచార ఆర్భాటమే
సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఎండ గరిష్ఠ స్థాయికి చేరే అవకాశముంది.

అంతులేని అసంతృప్తి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీల్లో 'కోల్డ్‌వార్' కొనసాగుతోంది. అన్ని నియోజకవర్గాలకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల అభ్యర్థులను ప్రకటించినా.. ముఖ్యనేతల మధ్య సఖ్యత కుదరడం లేదు. అభ్యర్థుల విషయంలో తమ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదని పలువురు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కుమ్ములాటలే నియోజకవర్గ సమన్వయ సారథులను మార్చే వరకు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే, సీఎం కేసీఆర్ ఆదేశాలతో పైకి అంతా బాగున్నట్లు కనిపిస్తున్నా.. అంతర్గత వ్యవహారం ఇందుకు భిన్నంగా ఉందనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది.
– సాక్షిప్రతినిధి, ఖమ్మం

బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న కోల్డ్‌వార్
- పలు నియోజకవర్గాల్లో మారని పరిస్థితి
- టికెట్ల కేటాయింపులో ముఖ్య నేతల వ్యవహారంపై గుర్రు
- తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని అసహనం
- ఇన్‌చార్జ్‌లను నియమించిన పర్యవేక్షిస్తున్న అధిష్టానం



'అతి' చేయొద్దు
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ఒక్కో స్థానమే వచ్చింది. ఈ పరిస్థితులతో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను ఖమ్మంలో నిర్వహించారు. పదవుల పరంగా కూడా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్టానం... రానున్న ఎన్నికల్లో పార్టీలోని ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధుల 'త్రయం'లో ఎవరు అతి చేసినా చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరిక జారీ చేసినట్లు తెలిసింది. అంతా ఐక్యంగా ఉండి పదికి పది స్థానాలు గెలిచేలా చూడాలని ఆదేశించినట్లు చెబుతుండగా.. పరిస్థితులు ఎప్పు డు చక్కబడతాయోనన్న చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది.

ముందుగానే ప్రకటించినా..
బీఆర్‌ఎస్‌లో ఆశావహుల జాబితా భారీగా ఉండడంతో అసమ్మతిని చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీ ఆర్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించారు. అయి తే ఇల్లెందు, పాలేరు, భద్రాచలం నియోజకవర్గాల్లో అభ్యర్థులపై ఆశావహుల అసంతృప్తి కొనసాగుతోంది. పార్టీని నమ్ముకున్నవారిని కాదని ఇటీవల వచ్చిన వారికే పెద్దపీట వేశారనే విమర్శలు వస్తున్నాయి. పార్టీలోని కొందరు ముఖ్యనేతల వ్యవహార శైలితోనే ఇలా జరిగిందనే ప్రచారం పార్టీశ్రేణుల్లో జరుగుతోంది. అంతేకాకుండా అసంతృప్తులు, అభ్యర్థుల నడు మ సయోధ్య కుదర్చాల్సిన నేతలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఎన్నికల్లో అభ్యర్థులకు నష్టం జరుగుతుందనే వాదన వినిపిస్తుండగా.. అధిష్టానం ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మూడింట 'కార్' చిచ్చు
ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో చిచ్చు చల్లారడం లేదు. పాలేరు, ఇల్లెందు, భద్రాచలంలో అభ్యర్థులపైనే గురిపెట్టిన ఆశావహులు, వారి అనుచరులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. పాలేరు నియోజకవర్గాన్ని పరిశీలిస్తే మాజీ మంత్రి తుమ్మల కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు అంతా సిద్ధమైనట్లేనని అనుచర వర్గం భావిస్తోంది. ఇప్పటికే నాలుగు మండలాల్లో అనుచరులు ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పడంతో తుమ్మల వెంట బీఆర్‌ఎస్ నుంచి ఎవరెవరు వెళ్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఇల్లెందులో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వర్గాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వరకు వెళ్లినా ముగియలేదు. అలాగే, భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు, పార్టీ నేత బోదబోయిన బుచ్చయ్యల మధ్య పొసగడం లేదు. ఈ స్థానం నుంచి బుచ్చయ్య చివరి వరకు ప్రయత్నం చేసినా... కాంగ్రెస్ నుంచి ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన వెంకట్రావుకు టికెట్ ఇవ్వడంతో ఆయన పార్టీలోని ముఖ్య నేతల తీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కూడా పార్టీలోని కొందరు నేతల తీరుపై అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. ఈక్రమంలోనే నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు తాజాగా సమావేశమై అభ్యర్థిని మార్చడంతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసానినే కొనసాగించేలా అధిష్టానాన్ని కోరాలని నిర్ణయించడం గమనార్హం.

నేతల తీరుతోనే మార్పు
అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం కేసీఆర్ ఆచితూచి వ్యవహరించడమే కాక సర్వే నివేదికలే ప్రామాణికంగా తీసుకున్నారని ప్రచారం జరిగింది. ఇక అసంతృప్తులను బుజ్జగించి నియోజకవర్గ ముఖ్యనేతలు, కేడర్‌ను సమన్వయం చేసేందుకు ఇన్‌చార్జిలను నియమించారు. ముందుగా అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించగా... ఇటీవల పరిణామాలు, కొందరు నేతల తీరుతో మూడు, నాలుగు చోట్ల సారథులను మార్చినట్లు సమాచారం. అంతేకాకుండా పార్టీలోని కొందరు ముఖ్య నేతలపై అభ్యర్థులుగా ఎంపికైన వారు అసహనంతో ఉన్నట్లు తెలిసింది. అసంతృప్తులను బుజ్జగించాల్సిన వారు... తమపైకి ఉసిగొలుపుతున్నారనే ఆగ్రహంతో అభ్యర్థులు ఉండగా, ఇదే తరహా భావన అధిష్టానంలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

న్యూస్‌రీల్

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ రాజశేఖర్



మంత్రిని సన్మానిస్తున్న రాజశేఖర్‌గౌడ్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్‌ఎస్)గా డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న బి.వెంకటేశ్వర్లు స్థానంలో ఆయనను నియమిస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజశేఖర్‌గౌడ్ ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన హైదరాబాద్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించగా.. డీసీహెచ్‌ఎస్‌ను పువ్వాడ అజయ్ అభినందించారు.

ఈనెల 21వరకు 'ఓపెన్' ప్రవేశాలు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల గడువును ఈనెల 21వరకు పొడిగించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. దూర విద్యావిధానంలో చదివేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమీపంలోని ఓపెన్ స్కూళ్ల కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు(80084 03522)ను సంప్రదించవచ్చని తెలిపారు.

వజ్రోత్సవాలకు జిల్లా ప్రజాప్రతినిధులు



బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకలను ప్రభుత్వం హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించింది. ఇందుకోసం జిల్లాల వారీగా ఎంపిక చేసిన ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి వెళ్తున్న ప్రజాప్రతినిధులు వెళ్తున్న బస్సును జిల్లా పరిషత్ ఆవరణలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందే..



నిరసనలో పాల్గొన్న జాక్టో బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో జాక్టో(జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలపగా జాక్టో బాధ్యులు వేముల మాధవరావు, వరప్రసాద రావు తదితరులు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ నిరసన తెలిపామని, ప్రభుత్వం సీపీఎస్ విషయంలో స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో గురుప్రసాద్, పి.రవి, రాము, బోస్, సీతారామారావు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 4నుండి జేఎన్‌టీయూ తరగతులు

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి ఇటీవల మంజూరు చేసిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలోని మహ్మదీయ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన బోధనకు ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు.

మెడికల్ కాలేజీ రెడీ!



పాత కలెక్టరేట్ భవనంపై ఏర్పాటుచేసిన బోర్డు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బోధనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 15న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇప్పటికే పనులు చివరి దశకు చేరగా, సీట్లు కూడా త్వరలో భర్తీ కానున్నాయి. ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించిన నేపథ్యాన పనులు ఓ కొలిక్కి రావడంతో శుక్రవారం కళాశాల బోర్డు ఏర్పాటుచేశారు.

శిక్షణను పరిశీలించిన డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ఉన్నతి, లక్ష్య పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ఖమ్మం శాంతినగర్‌లోని పాఠశాలలో శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా డీఈఓ సోమశేఖరశర్మ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేలా శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలుచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన రాఖీ!



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సత్తుపల్లి బస్టాండ్

- గత ఏడాది కంటే రూ.21లక్షల అ'ధనం'
- రీజియన్‌కు రెండు రోజుల్లో రూ.2.75 కోట్ల ఆదాయం
- రికార్డ్ బ్రేక్ చేసిన సత్తుపల్లి డిపో

సత్తుపల్లిటౌన్: సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లిన ఆడపడుచుల్లో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులనే ఎంచుకోవడం సంస్థకు కలిసొచ్చింది. బుధ, గురు వారాల్లో కలిపి ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌కు గణనీయమైన ఆదాయం నమోదైంది. గతేడాది ఈ సమయాన రూ.2.54 కోట్లు ఆదాయం లభించగా.. ఈసారి రూ.2.75 కోట్లు ఆదాయం వచ్చింది. రెండు రోజుల పాటు ప్రయాణికులతో రీజియన్‌లోని అన్ని బస్టాండ్లు కిక్కిరిసి కనిపించాయి. ఇక శుక్రవారం కూడా తిరుగు ప్రయాణమైన వారితో బస్సులు కళకళలాడడంతో మెరుగైన ఆదాయం నమోదయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణతో..
రాఖీపౌర్ణమి సందర్భంగా రద్దీ ఉండే అవకాశముండడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, అధికారులతో సహా ఉద్యోగులంతా బస్టాండ్లలోనే మకాం వేసి ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తూ అందుకు తగినట్లు బస్సులు నడిపించారు. రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచనలు పాటిస్తూ బస్టాండ్లలో రద్దీని సమీక్షిస్తూ హైదరాబాద్, ఖమ్మం రూట్లలో అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటుచేశారు.

అదనపు సర్వీసులు
ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌లోని డిపోలకు రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అలాగే, ఖమ్మంతో పాటు ఇతర డిపోల నుంచి కొన్ని సర్వీసులు తిప్పారు. ఇక ఆగస్టు 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల నుంచి డ్రా ద్వారా ఎంపిక చేసిన వారికి బహుమతులు అందజేస్తామని సంస్థ ప్రకటించింది. దీంతో రాకపోకలకు ఎక్కువగా ఆర్టీసీనే ఎంచుకున్న మహిళలు... టికెట్లను బాక్స్‌ల్లో వేశారు.



ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ

ఆదాయం ఇలా..
ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల వ్యాప్తంగా రెండు రోజుల్లో 2,64,793 కి.మీ. మేర బస్సులు నడిపారు. తద్వారా రూ.2.75 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో అత్యధికంగా మణుగూరు డిపో 95 శాతం ఓఆర్ సాధించడం విశేషం. ఇక కొత్తగూడెం డిపో 93 శాతం, ఖమ్మం, మధిర డిపోలో 90శాతం చొప్పున, భద్రాచలం 88శాతం, సత్తుపల్లి 87 శాతం ఓఆర్ సాధించాయి. కాగా, సత్తుపల్లి ఆర్టీసీ డిపో రోజువారీ ఆదా య లక్ష్యం రూ.17లక్షలు కాగా.. డిపో చరిత్రలోనే గురువారం రూ.26 లక్షల ఆదాయం రావడంతో రికార్డు సృష్టించినట్లయింది. గణనీయమైన ఆదాయం సాధించిన నేపథ్యాన ఆర్టీసీ డిపోల్లో శుక్రవారం సాయంత్రం ఉద్యోగులకు అధికారులు స్వీట్లు పంపిణీ చేసి అభినందించారు.

సమష్టి కృషితోనే..



రాఖీ పౌర్ణమికి ఖమ్మం రీజియన్ అత్యధిక ఆదాయాన్ని సాధించింది. అధికారులు, ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే అత్యధిక ఆదాయం. ఇందుకు కృషిచేసిన ఉద్యోగులందరికీ అభినందనలు.
– సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఖమ్మం

చీమలపాడు సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు

- అటవీ అధికారులపై దాడి నేపథ్యాన కలెక్టర్ ఉత్తర్వులు

కారేపల్లి: అటవీ అధికారులపై దాడిచేసి గాయపర్చడంతో పాటు సర్పంచ్ పదవిని దుర్వినియోగం చేశారని నిర్ధారిస్తూ ఖమ్మం జిల్లా చీమలపాడు సర్పంచ్ మాలోతు కిషోర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఆయనను మూడు నెలల పాటు పదవి నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు చేశారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గతనెల 5వ తేదీ రాత్రి కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి పాటిమీది గుంపు బీట్‌లోని రిజర్వ్ ఫారెస్టులో బోర్లు వేస్తున్నారని సమాచారంతో అటవీ ఉద్యోగులు దేవర రమేష్, నక్కలబోయిన రమేష్‌తో పాటు మరో ముగ్గురు బయలుదేరారు. చీమలపాడు సర్పంచ్ మాలోతు కిషోర్, మరికొందరు వీరి వాహనాన్ని అడ్డుకుని దాడి చేయడమే కాక సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ఘటనపై 6వ తేదీన కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా సర్పంచ్‌పై కేసు నమోదైంది. అనంతరం గ్రామస్తుల నుంచి డబ్బు తీసుకుని అటవీ ప్రాంతం ఆక్రమణకు ప్రేరేపిస్తున్నాడని, రిజర్వ్ ఫారెస్ట్‌లో బోర్లు వేయిస్తున్నాడని, ఇసుక, రాళ్ల రవాణా చేస్తున్నట్లుగా అటవీఅధికారులు సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం పదవిని దుర్విని యోగం చేసినట్లు తేలడంతో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం..



మట్టి గణపతి ప్రతిమతో అదనపు కలెక్టర్, ఉత్సవ కమిటీ సభ్యులు

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం సహకారనగర్: రానున్న వినాయకచవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, ఈ విషయంలో ఉత్సవ కమిటీలు బాధ్యత తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ బాధ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలకు ఏ ఇబ్బంది ఎదురుకాకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాల ఏర్పాటు, పోలీసులు, విద్యుత్ శాఖ అనుమతి కోసం ప్రతీ మండపం నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని తెలిపారు. నగరంలోని మున్నేరు, ప్రకాష్‌నగర్‌లో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఖమ్మం నగరంతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీ పరిధిలోనూ ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సుడా చెర్మన్ బచ్చు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈసమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, ఆర్‌టీఓ కిషన్‌రావు, కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఈఈ కృష్ణలాల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, అగ్నిమాపక శాఖ అధికారి జయప్రకాష్, ఏసీపీలు గణేష్, రామానుజం, డీఎల్పీఓ పుల్లారావు, ఆర్‌డీఓలు గణేష్, అశోకచక్రవర్తి, తహసీల్దార్లు స్వామి, రామకృష్ణతో పాటు ఉత్సవ కమిటీల బాధ్యులు కన్నం ప్రసన్నకృష్ణ, వినోద్ లహోటి, దండా జ్యోతిరెడ్డి, డి.జయ్‌కిరణ్, దిలీప్‌కుమార్, అల్లిక అంజయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉత్కంఠగా...

- సైన్యంలో ఎంపికకు మొదలైన 'అగ్నివీర్' పోటీలు
- తొలిరోజు 1,225 మందిలో 926 మంది హాజరు
- ఇందులో క్వాలిఫై అయింది 329 మంది
- ఏర్పాట్లు, పోటీలను పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్



పేర్లు నమోదు కోసం వేచి ఉన్న అభ్యర్థులు

ఖమ్మం స్పోర్ట్స్: దేశరక్షణలో కీలకమైన సైన్యంలో చేరేందుకు యువత ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ఈనేపథ్యాన రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 'అగ్నివీర్'లో భాగంగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం పోటీలు(రిక్రూట్‌మెంట్ ర్యాలీ) మొదలయ్యాయి. పరుగు పందెంతో పాటు ఇతర పోటీలు నిర్వహించగా అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొనగా... ఎంపికపై చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. కాగా, అభ్యర్థులు ఇబ్బంది పడకుండా శుక్రవారం తెల్లవారుజామున 2గంటలకే పోటీలు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో ఎంపికైన వారికి పోటీలు నిర్వహించగా... జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఆర్మీ ఉన్నతాధికారి కల్నల్ కీట్స్ దాస్ లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు సజావుగా ఎంపికలు జరగడంతో ఆర్మీ అధికారులు ఊపిరి పీల్చుకోగా.. 8వ తేదీ వరకు ప్రతిరోజు ఇలాగే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పరుగులో వెనుకబాటు
తొలిరోజు మొత్తం 1,225 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 926 మంది పాల్గొన్నారు. కాగా, ఫిజికల్ టెస్ట్ అనంతరం 329 మంది మాత్రమే మెడికల్ టెస్ట్‌కు అర్హత సాధించారు. వీరి జాబితాను ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అందజేశాక... అన్ని వివరాలు పరిశీలించి తుది జాబితా వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, ఫిజికల్ టెస్ట్‌కు హాజరైన 926మందిలో చాలా మంది అభ్యర్థులు 1,600 మీటర్ల పరుగులు, తొమ్మిది ఫీట్ల జంప్, జెడ్ క్రాస్ బార్ తదితర అంశాల్లో అర్హత సాధించలేక వెనకబడ్డారు.



ఆన్‌లైన్ వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆద్యంతం కలెక్టర్...
జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రారంభమైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై కలెక్టర్ గౌతమ్ వారం రోజులుగా పర్యవేక్షిస్తున్నారు. తొలిరోజు కూడా ఆయన తెల్లవారుజామున రెండు గంటలకే స్టేడియంకు వచ్చారు. అధికారులకు సూచనలు చేయడంతో పాటు అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్మీ ఉన్నతాధికారి కల్నల్ దాస్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రెండు యూపీహెచ్‌సీలు

ఖమ్మం, సత్తుపల్లికి కేటాయింపు

ఖమ్మం వైద్యవిభాగం/సత్తుపల్లి: జిల్లాకు కొత్తగా రెండు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ)ను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 యూపీహెచ్‌సీలను మంజూరు చేయగా, జిల్లాకు రెండు కేటాయించారు. వీటిని ఖమ్మం నగరం, సత్తుపల్లిలో ఏర్పాటుచేయనున్నట్లు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఒక్కో ఆస్పత్రికి రూ.1.43 కోట్లు కేటాయించింది. కాగా, ఖమ్మం నగర పరిధిలో ప్రస్తుతం నాలుగు యూపీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. సత్తుపల్లికి యూపీహెచ్‌సీ కేటాయించడంపై ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సెంటర్ ఏర్పాటుతో పట్టణ వాసులకు వైద్యసేవలు మరింత చేరువవుతాయని ఆయన పేర్కొన్నారు. మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

కోల్‌డస్ట్ పేరుకుపోవద్దు



జీవీఆర్ ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం జీవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీలో కోల్ డస్ట్ పేరుకుపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం జీవీఆర్, కిష్టారం ఓసీలను సందర్శించారు. అనంతరం జీవీఆర్ సీహెచ్‌పీ అధికారులతో బొగ్గు రవాణా విషయమై సమీక్షించారు. ఎలాంటి బ్రేక్‌డౌన్స్ లేకుండా రవాణా జరగాలని, సీహెచ్‌పీకి కావాల్సిన పరికరాలను స్పేర్‌గా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, అధికారులు కోటిరెడ్డి, రామకృష్ణ, ఎస్.వెంకటాచారి, ఎంవీ నర్సింహారావు, మదీనాబాషా, మోహన్, రాకేశ్ పాల్గొన్నారు.

నేడు చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో అతిపెద్ద వస్త్ర, ఆభరణాల షోరూం చెన్నై షాపింగ్ మాల్‌ను శనివారం ప్రారంభిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ మద్రి వెంకటరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మద్రి శశిధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని నూతన బస్టాండ్ సమీపాన అన్ని హంగులతో నిర్మించిన ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభానికి ముస్తాబైందని పేర్కొన్నారు. సినీతార కృతిశెట్టి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా 17వ షోరూంను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విశాలమైన పార్కింగ్‌కు తోడు లెక్కకు మించి వెరైటీలు, సరికొత్త డిజైన్లతో జ్యూయెలరీ అతి తక్కువ ధరకే లభిస్తాయని చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొంటారని వివరించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్

చింతకాని: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాల ని.. తద్వారా కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రామంలోని పొదుపు సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న రుణాలు, వాటితో చేస్తున్న వ్యాపారాలు, అభివృద్ధిపై ఆరా తీశారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు సంఘాలు మరింత బలోపేతం కావాలని చెప్పారు. రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. సర్పంచ్ ఆలస్యం నాగమణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం తిరుమలరావుతో పాటు భాస్కర్, మమత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సత్తుపల్లి: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సుభానీ శుక్రవారం రాత్రి కాలనీ నుంచి సిద్దారం రోడ్డులో పాత సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా... ఎంఆర్ గార్డెన్ సమీపాన ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సుభాని, వీరిశెట్టి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో సుభాని పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాంబాబు (ఫైల్)

కారేపల్లి: కుటుంబానికి సంబంధించి పంచాయతీ నిర్వహించిన గ్రామ పెద్దలు తనను అవమానించారనే మనస్తాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుడు సెల్ఫీ వీడియోలో వెల్లడించిన ప్రకారం ఆయన భార్య ఫిర్యాదుతో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కారేపల్లికి చెందిన జవ్వాజి రాంబాబు(40)కు, కమలాపురానికి చెందిన మానసతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొన్నాళ్లుగా రాంబాబుకు, తల్లి లక్ష్మి, వివాహిత అయిన ఆయన సోదరి ఆళ్ల హైమావతితో గొడవలు జరుగుతున్నాయి. ఆగస్టు 24వ తేదీన గ్రామ పెద్దలైన జవ్వాజి శ్రీను, ఇమ్మడి తిరుపతిరావు సమక్షాన పంచాయితీ నిర్వహించగా, తల్లి లక్ష్మితోపాటు ఇద్దరు పెద్దమనుషులు తనను అవమానించారని చెబుతూ రాంబాబు చేనుకు వెళ్లి పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలో వివరాలు వెల్లడించాడు. ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా, రాంబాబు భార్య ఫిర్యాదు మేరకు తల్లి, సోదరి, ఇద్దరు పెద్దమనుషులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,026

ఆయన వాహనం... స్కూటీ!

- తెలంగాణ, ఏపీలోని పలు చోట్ల చోరీలు
- అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసిన ఖమ్మం పోలీసులు
- రూ.18లక్షల విలువైన సొత్తు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీపీ వారియర్, పక్కన అధికారులు

ఖమ్మం క్రైం: వంద కాదు, రెండు వందలు కాదు ఏకంగా వేల కిలోమీటర్లు బస్సు, కారు, రైళ్లను ఆశ్రయించకుండా కేవలం స్కూటీపై మాత్రమే ప్రయాణిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీకి పాల్పడ్డాడో ఘరానా నిందితుడు. ఈమేరకు నిఘా వేసిన ఖమ్మం ఎట్టకేలకు ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను కమిషనరేట్ లో సీపీ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం వెల్లడించారు.

స్కూటీపై తిరుగుతూ రెక్కీ....

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరానికి చెందిన ఆవుల కిరణ్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు దిగాడు. అయితే, ఎవరికీ అనుమానం రాకుండా ఎంత దూరమైనా స్కూటీపై వెళ్లి ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించేందుకు రెక్కీ నిర్వహించేవాడు. ఇక చోరీకి ఎంచుకున్న ఇంటి పరిసరాలను గమనిస్తూ అప్పటికే చీకటి పడితే లాడ్జీలో మకాం వేసేవాడు. అనంతరం మధ్యాహ్నం ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో, బీరువాలో ఉన్న ఆభరణాలు, నగదు తీసుకున్నా ఆ ఊరి నుంచి వెళ్లిపోయేవాడు.

ఇలా చిక్కాడు....

ఖమ్మం వచ్చిన నిందితుడు కిరణ్‌కుమార్ త్రీటౌన్ ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ చేశాడు. అనంతరం సొత్తుతో పారిపోతుండగా, అప్పటికే నిఘా వేసిన సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వ్యవహారం బయటపడింది. దీంతో ఆయన నుంచి రూ.18లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రవి, హరికృష్ణ, గణేష్, సీఐలు సత్యనారాయణ, బాలాజీ, బాలకృష్ణ, సీసీఎస్ సిబ్బంది గజేంద్ర, కోలా శ్రీనివాస్, వాల్యా పాల్గొన్నారు. కాగా, నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగులకు సీపీ రివార్డులు అందించారు.

బెదిరింపులకు దిగుతున్న ట్రాన్స్‌జెండర్లపై చర్యలు

శుభకార్యాలు జరుగుతున్న ఇళ్లకు వెళ్లి డబ్బుల కోసం బలవంతం చేస్తూ బెదిరిస్తున్న ట్రాన్స్‌జెండర్లపై చర్యలు తీసుకుంటామని సీపీ విష్ణు ఎస్.వారియర్ హెచ్చరించారు. ఇటీవల ట్రాన్స్‌జెండర్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఈమేరకు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని నగర ఏసీపీ ఆంజనేయులు, త్రీటౌన్ సీఐ సత్యనారాయణను ఆయన ఆదేశించారు. అలాగే, ఖమ్మంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఐదు బైక్ పార్టీలను ఏర్పాటు చేశామని... సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి సరిదిద్దుతారని సీపీ తెలిపారు.

వ్యవసాయాన్ని బతికించుకోవాలి..

హేమంత్‌కుమార్ సన్మాన సభలో వక్తలు



హేమంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న కోటేశ్వరరావు, నాయకులు

వైరా: దేశంలో ఎక్కువ మంది ప్రధాన జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని బతికించుకోవాల్సిన అవసరముందని.. తద్వారా ఆహార భద్రతకు ముప్పు ఉండదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తెలిపారు. వైరా కేవీకే కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్‌గా బదిలీ అయిన డాక్టర్ జె.హేమంత్‌కుమార్‌ను శుక్రవారం రైతు సంఘాల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాల మాట్లాడుతూ రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించేలా హేమంత్ కుమార్ వంటి శాస్త్రవేత్తల అవసరం ఉందని తెలిపారు. వైరా కేవీకేలో పనిచేసిన ఎనిమిదేళ్లలో 36 అవార్డులు గెలుచుకున్న ఆయన అభినందనీయడని కొనియాడారు. కార్యక్రమంలో వైరా ఏడీఏ వి.బాబూరావు, కమ్మ మహాజన సంఘం నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, అడపా రామకోటయ్య, పారుపల్లి కృష్ణారావు, తాతా రంగారావు, మచ్చా బుజ్జి, పాదిల హరినాథ్, చింతనిప్పు మురళి, పోతినేని భూమేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీధర్, ఏఓలు పవన్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

అస్వస్థతకు గురైన ఎస్సై రాధాకృష్ణన్



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: మండలంలోని శంకరగిరితండా లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి, ఎస్సైలు రాధాకృష్ణన్, శంకర్‌తో పాటు సిబ్బంది లాలు, హరీశ్, బలరాం, రామారావు తనిఖీలు నిర్వహించారు. గ్రామ శివారు అటవీ ప్రాంతానికి కాలినడకన వెళ్లిన వారు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 100 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఈక్రమంలోనే ఎస్సై రాధాకృష్ణన్ శరీరం ఒక్కసారిగా డీహైడ్రేషన్ కావటంతో కుప్పకూలారు. దీంతో సీఐ పోశెట్టి ఆధ్వర్యాన సిబ్బందిని ఆయనను నేలకొండపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

షీ టీమ్స్‌తో మహిళల భద్రతకు భరోసా



కళాశాల విద్యార్థులతో షీ టీమ్, యజమాన్యం, అధ్యాపకులు (ఫైల్)


ఖమ్మంక్రైం: జిల్లాలో షీ టీమ్ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మహిళలు, విద్యార్థినులపై వేధింపులను అరికడుతున్నారని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. గత నెలలో అందిన ఫిర్యాదులకు సంబంధించి రెండు ఎఫ్‌ఐఆర్‌లు, రెండు పిటీ కేసులు నమోదు చేయడంతో పాటు ఆకతాయిలకు తల్లిదండ్రుల సమక్షాన కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కాగా, షీ టీమ్స్ బృందాలు విద్యాసంస్థల్లో విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాయని వెల్లడించారు. వేధింపులకు గురైన వారు షీ టీమ్స్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కానీ, షీ టీమ్ నంబర్ 87126 59222కు ఫిర్యాదు చేయొచ్చని సీపీ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: పదో తరగతి విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండల కేంద్రానికి విద్యార్థిని(15) పదో తరగతి చదువుతోంది. ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇంతలోనే స్థానికులు గమనించి ఆమెను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటనకు కారణాలు తెలియరాలేదు.

ఇంజనీరింగ్ పనుల్లో అలసత్వం వద్దు..

- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్




అధికారులతో సమీక్షిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ద్వారా చేపడుతున్న పనుల్లో అలసత్వం వహించినా, నాణ్యత లోపించినా బాధ్యులపై శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని పీఓ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో రోడ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్ల పనుల్లో నాణ్యత పాటించాలని, గిరిజనులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎవరైనా టెండర్‌దారులు పనులు చేయని పక్షంలో రద్దు చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఆదర్శ గ్రామ యోజన పథకం కింద మంజూరైన నిధులను ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ స్కూళ్లు, సబ్ సెంటర్లకు కేటాయించి.. పనులు పూర్తయ్యాక నిధులు మిగిలితే ఇతర స్కూళ్లకు కేటాయించాలని చెప్పారు.

కనీస సామర్థ్యాలు తప్పనిసరి

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్‌లలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు ఉండేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురుకులాలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించి సబ్జెక్టుల వారీగా నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు తొలగింపుపై వివాదం



చెట్టును పరిశీలిస్తున్న ఉద్యోగి

నేలకొండపల్లి: పాఠశాలలో చెట్టు తొలగింపు రెండు శాఖల మధ్య వివాదానికి కారణమైంది. అవసరమైతే తనపై కేసు పెట్టుకోవాలని ఆర్అండ్‌బీ జేఈ చెప్పడంతో అటవీ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు - మన బడి ద్వారా చేపడుతున్న పనుల్లో భాగంగా ఓ చెట్టును అనుమతి లేకుండా తొలగించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డానియేల్ చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కాంట్రాక్టర్‌కు జరిమానా విధించేందుకు కొలతలు తీస్తుండగా, ఆర్అండ్‌బీ జేఈ దేవేందర్ చేరుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జేఈ కాంట్రాక్టర్‌పై కాకుండా తనపై కేసు పెట్టుకోవాలని సూచించడంతో అటవీ ఉద్యోగులు అక్కడి నుంచి వెళ్లి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై జేఈ మాట్లాడుతూ పని జరుగుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పడిపోయిన విషయాన్ని వివరించారని చెప్పారు. కాంట్రాక్టర్‌పై కేసు పెడితే పని ఆగుతుందనే భావనతో తనపై కేసు పెట్టాలని చెప్పినట్లు తెలిపారు.

దేశ సేవ కోసం సిద్ధం



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారి

సైన్యంలో నియామకాల కోసం అగ్నివీర్ ర్యాలీ ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం మొదలైంది. ఈనెల 8వ తేదీ వరకు ఈవెంట్లు జరగనుండగా... రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈమేరకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే అభ్యర్థులు చేరుకోగా.. వివరాలు నమోదు చేసిన అనంతరం ఈవెంట్లు నిర్వహించారు.

– ఖమ్మం స్పోర్ట్స్



పుల్ అప్స్ చేస్తున్న అభ్యర్థులు



9 ఫీట్ల జంప్ చేస్తూ...



శుక్రవారం రాత్రి స్టేడియం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



వైరాలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

వైరా: ఎన్నికల ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్‌నాయక్ సూచించారు. వైరాలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సెక్టార్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించడమే కాక మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. అంతేకాకుండా కొత్త, పాత ఓటర్లు అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం గృహలక్ష్మి, జీఓలు 58, 59 దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు ఆరా తీశారు.

వారికి ఓటు హక్కు కల్పించండి...

నేలకొండపల్లి: ఓటు హక్కు కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు చేసిన ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగారు. నేలకొండపల్లి మండలం కొత్తూరు, బౌద్ధక్షేత్రం సమీపాన పదేళ్ల క్రితం స్థలాలు కొనుగోలు చేసుకుని గుడిసెలు వేసుకుని ఉంటున్న 27 కుటుంబాల వారికి ఇప్పటివరకు ఓటు హక్కు లేదు. దీంతో ఇటీవల జరిగిన సమావేశంలో ఆమ్ ఆద్మీ నాయకుడు పసుమర్తి శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు. ఈమేరకు స్పందించిన కలెక్టర్ విచారణ జరపాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన కొత్తూరు, బౌద్ధక్షేత్రం వద్ద ఉన్న గుడిసెల వద్దకు అధికారులతో కలిసి వెళ్లి వివరాలు ఆరా తీయడంతో పాటు ఓటుహక్కు నమోదు కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.శ్వేత, జూనియర్ అసిస్టెంట్ సుందర్‌సింగ్‌తో పాటు నాయకులు పసుమర్తి శ్రీనివాస్, పగిడికత్తుల రామదాసు పాల్గొన్నారు.

ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ పథకాల పేర ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనలో రాష్ట్రప్రభుత్వం విఫలమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరిచే విధంగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతోందన్నారు. కార్పొరేట్ వర్గానికి మేలు చేసే విధంగానే పాలన సాగుతోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన ఈ నెల 7 వరకు నిర్వహించే పోరాటాల్లో ప్రజలు అత్యధికంగా పాల్గొనాలని కోరారు. అలాగే, ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను తెలంగాణవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు భారతి, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బండి రమేశ్, చింతలచెర్వు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రి కిటకిట



ఓపీ వద్ద క్యూ లైన్



ఇన్ పేషంట్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఖమ్మం వైద్యవిభాగం: వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. విపరీతమైన ఉక్కపోత, ఎండవేడితో ఊపిరి ఆడని పరిస్థితులు నెలకొనగా వారం రోజులుగా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సీజనల్ వ్యాధుల ప్రభావం అంతగా లేకపోయినా సాధారణ జ్వరాలు మాత్రం విజృంభిస్తున్నాయి. దీంతో జ్వరపీడితులతో జిల్లా పెద్దాస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం శుక్రవారం కిటకిటలాడుతూ కనిపించాయి. ఓపీ వద్ద భారీగా క్యూ లైన్ ఉంటుండగా, ఇన్‌పేషంట్ వార్డులు కూడా రద్దీగా ఉంటున్నాయి.

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	59,489 ▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251 ▲	4
వెండి (కిలో)	74,838 ▽	193

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రైట ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా-విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్ట్‌లో ఆల్‌టైమ్ 'రయ్'!




న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్ఠానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్‌ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016-2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్ద్వంద్వంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే



అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరపున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.

నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్-ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4-1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరపున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్-30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



కుమారుడితో ఇస్నర్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-1, 7-6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6-2, 6-2, 6-7 (6/8), 6-2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6-3, 6-2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3-6, 4-6, 7-6 (7/3), 6-4, 7-6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు - నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) - డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3-6, 5-7తో హ్యూగో నిస్ (మొనాకో) - జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) - కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో లాస్లో జెరె (సెర్బియా) - హ్యూస్లర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**